క్లుప్తంగా

కాలువలో పూడిక తొలగింపు



గెద్దనాపల్లి బుర్రివారి కాలువలో పూడిక తీస్తున్న జేసీబీ

కిర్లంపూడి: గెద్దనాపల్లిలోని బుర్రివారి కాలువలో శనివారం పేరుకుపోయిన గడ్డి, మురుగును పొక్లెయిన్‌తో తొలగించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని స్థానిక సర్పంచ్ మొల్లేటి గంగాభవాని ఆదేశాలతో గ్రామంలోని కాలువల పూడిక తీత పనులను ముమ్మరం చేశారు. పూడికతీత పనులను సభ్యుడు మొల్లేటి గంగాధర్, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించారు.

ముదునూరి ఆర్థిక సాయం



భాస్కరరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీ కృష్ణంరాజు

అన్నవరం: కాలేయ సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కోగూరి భాస్కరరావును నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందచేశారు. అతని వైద్యానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని ఆయన నాయకుల సమక్షంలో హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, గోపాలపట్నం మాజీ సర్పంచ్ ఈశ్వరరావు, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, తాటిపాక కృష్ణ తదితరులున్నారు.

హెర్నియా బాధితుడికి ఆర్థిక సాయం

గండేపల్లి: హెర్నియా వ్యాధితో బాధపడుతున్న మండలంలోని గండేపల్లికి చెందిన కటకం వెంకటరమణకు శనివారం దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధితునికి సాయం అందించాలనే ఉద్దేశంతో గ్రామానికి చెందిన పసుమర్తి సుబ్రహ్మణ్యం సోషల్ మీడియా ద్వారా పలువురికి బాధితుడి పరిస్థితిని వివరించడంతో స్పందించిన పలువురు దాతలు ద్వారా సేకరించిన రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

కోటి ఆశలతో కొత్త లోకంలోకి



గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న విద్యార్థులతో చైర్మన్, అధ్యాపకులు ..

గోకవరం: మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యేయేషన్ డే సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను ప్రదానం చేశామని శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు తెలిపారు. కళాశాల చైర్మన్ పి.కనకరాజు, సెక్రటరీ పి.నాగమణి మాట్లాడుతూ 2022 బ్యాచ్ విద్యార్థులు కాకినాడ జెఎన్టీయూ యూనివర్సిటీ పరిధిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు పొందారన్నారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ దుర్గా ప్రసాద్, కళాశాల డైరెక్టర్లు హారిక, సంతోష్, ప్రవళిక, సంతోష్, కోఆర్డినేటర్ శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీకి శిక్షణ ముగింపు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ టెక్నిక్ పురోగతులు అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో.చాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అనంతరం యూనివర్సిటీ నందు ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యాపకుల ఇండక్షన్ కార్యాక్రమం కూడ ముగిసినట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

కార్పొరేట్‌లకు కొమ్ము కాస్తున్న మోదీ

కోటనందూరు: కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జాతీయ నాయకురాలు జి.బేబీరాణి డిమాండు చేశారు. స్థానిక నూకాలమ్మ గుడిలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. బేబీరాణి మాట్లాడుతూ యాజమాన్యాలకు కార్మికులను బానిసలుగా మార్చేందుకే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని ఆరోపించారు. కార్పొరేట్‌లకు కొమ్ము కాసేందుకే ప్రధాని మోదీ అనేక కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం మీద సమరశంఖం పూరించేందుకు జులై తొమ్మిదిన చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు గోవిందు, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా..ప్రయాణం సాగేదెలా..?

- ఇరుకు రోడ్లతో ప్రజల అవస్థలు
- ఆర్ అండ్ బి అధికారుల చోద్యం
- రోడ్లు విస్తరించాలని డిమాండ్



కత్తిపూడి బస్‌స్టేషన్ సెంటర్లో రద్దీగా ఉన్న రోడ్డు



జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా ఆగిన లారీలు

శంఖవరం: మండలంలోని దశాబ్దాల కాలం నాటి ఇరుకైన పలు ప్రధాన రోడ్లపైనే ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్లు జిల్లాలోని వివిధ గ్రామాలకు, ముఖ్య పట్టణాలకు అనుసంధానం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. ముఖ్యంగా ప్రధాన జంక్షన్‌ల వద్ద ఈ సమస్య మరింత జటిలంగా మారింది. కత్తిపూడి నాలుగు కూడళ్ల ప్రధాన జంక్షన్, శంఖవరం వెళ్లే రోడ్డు, కాకినాడ, రాజమండ్రి, తుని వెళ్లాలంటే ఈ ప్రధాన రహదారి వెంబడే వెళ్లాలి. చినుకు పడితే చిత్తడిగా మారే రోడ్లు, కళ్లలోకి లేచిపడే దుమ్ము అడుగు తీసి అడుగేయాలంటే భయం. ఇదీ కత్తిపూడి మండలంలోని అంతర్గత రహదారుల పరిస్థితి. నింబంధనలకు విరుద్ధంగా ఆటోలు, బైక్‌లు, చిరు వ్యాపారుల బండ్లు రోడ్డుపై విక్రయాలు జరపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. పాఠశాలలకు, కళాశాలలకు, ప్రభుత్వ కార్యకలాపాలకు, వ్యాపారాల నిమిత్తం నిత్యం అనేక మంది ఈ రోడ్ల వెంబడే రాకపోకలు చేపడుతుంటారు. కనీసం నడక సాగించాలన్న ఈ కష్టంగా ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గతంలో కత్తిపూడి మీదుగా 216, 16వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. గ్రామంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడినప్పటికీ విస్తరణ పనులు పూర్తయాయ్యి. మళ్లి యథావిధంగా కొంతమంది ఆక్రమణలు చేపట్టడంతో రోడ్డు ఇరుకుగా మారిందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

సమస్యను పరిష్కరించాలి

పోలీసులు,హైవే అధికారులు, ప్రజలు, అటు ప్రయాణికులు సమస్యను దృష్టిలో ఉంచుకుని రోడ్లు వెడల్పు చేయడంతో పాటు, నిరంతరం గస్తీ నిర్వహించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పార్కింగ్ స్థలాన్ని వినియోగించుకోవాలి

నాలుగు కూడలికి ప్రధాన జంక్షన్ కత్తిపూడి శివారులో వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ ఉన్నప్పటికీ వాహన చోదకులు సద్వినియోగం చేసుకోవడంలేదు. హోటళ్లు, కిరణా దుకాణాల వినియోగాదారులు ఇష్టానుసారం 16వ నంబర్ జాతీయ రహదారిపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. పోలీసులు, హైవే సిబ్బంది పలుమార్లు వాహనచోదకులను హెచ్చరించిన ఫలితం ఉండడం లేదు. సంబంధిత అధికారులు ప్రచారాలు చేయడంతో పాటు వాహన చోదకులను హెచ్చరించి పార్కింగ్‌లో నిలుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు..

పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎక్కడబడితే అక్కడే వాహనాలు నిలిపివేయడంతో నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతులు గురైన వాహనాలు, విశ్రాంతి తీసుకునేందుకు రోడ్డుపై నిలిపడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిత్యం ట్రాఫిక్ సమస్య



కత్తిపూడి అన్ని గ్రామాలకు ముఖ్య కూడలి. దీంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. నిత్యం ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు, పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

కొల్లు శ్రీను, ప్రయాణికుడు, జి.కొత్తపల్లి,

రోడ్డుపై నిలపడంతో..



కత్తిపూడి ప్రధాన రహదారిపైనే అధిక సంఖ్యలో వాహనాలు నిలిపివేస్తుండటంతో ప్రమాదాలు ఎక్కువుగా సంభవిస్తున్నాయి. కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్టిక్కర్లు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలి.

మాదే సామేల్‌రాజ్, ప్రయాణికుడు, నెల్లిపూడి

చర్యలు చేపడతాం...



ఇప్పటికే ప్రతి రోజు హైవే పోలీసులు ట్రాఫిక్ ,ప్రమాదాల నివారణకు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రమాదాలు అరికట్టేందుకు కృషి చేస్తున్నాం . వాహన చోదకులకు పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం . నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చేపడతాం.

జి.హరిబాబు, అన్నవరం ఎస్సై

అత్తింటి వేధింపులు.. కేసు నమోదు

తుని రూరల్: మండలంలోని ఎస్.సూరవరం గ్రామానికి చెందిన ఎస్.అనుష అనే వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె అత్తింటి కుటుంబ సభ్యులు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భర్త, అత్తమామలు, బావ, తోటికోడలు వేధింపులకు పాల్పడుతున్నట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొందని ఎస్సై వివరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డాక్టరేట్‌కు ఎన్నికైన ఆదిత్య లెక్చరర్



విజయ్ కుమార్ రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో లాజిస్టిక్స్ విభాగంలో సేవలందిస్తున్న పాముూరి విజయ్ కుమార్ రెడ్డికి డాక్టరేట్ లభించినట్టు యూనివర్సిటీ ప్రో.చాన్సలర్ ఎస్. సతీష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ప్రసాద్ పెద్ది నేతృత్వంలో హైదరాబాద్ కో గైడ్ విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ బి.వి శ్రీనివాసులు పర్యవేక్షణలో డెవలపింగ్ అండ్ బొటాని ఇంప్లిమెంటింగ్ గ్రాఫ్ డేటాబేస్ సిస్టమ్ ఫర్ ఎఫీషిమెంట్ అండ్, హెల్త్ కేర్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ అంశంపై సమర్పించిన థీసిస్‌కు గాను రాజస్థాన్ జెజెటీ యూనివర్సిటీ ఈ డాక్టరేట్‌ను అందించిందన్నారు. డిప్యూటీ ప్రో.చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్లు ప్రో. శ్రీనివాస్, ఎ.రమేష్, ఎస్.రమాశ్రీ, జీ.సురేష్, డీన్లు, తదితరులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం



ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) కార్యాలయంలో మాట్లాడుతున్న కమిటి చైర్మన్ అజయ్‌కుమార్

ప్రత్తిపాడు: ఆదివాసీ కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం తగదని రాష్ట్ర ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ సలహాదారు రాష్ట్ర కమిటి చైర్మన్ పీఎస్ అజయ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా ఆదివాసీ సంఘం సమావేశం జరిగింది. ముఖ్యఅతిధిగా విచ్చేసిన పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడతూ ప్రతీ ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో రెవెన్యూ అధికారుల అలసత్వం కారణంగా ఆదివాసీ కుల ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థినీ, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదివాసీలు జీవిస్తున్న మండలాల్లో ఆర్డీఓలు, తహసీల్దార్లు మారుతున్న సందర్భంలో ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ దృష్టి సారించాలని కమిటి చైర్మన్ పీఎస్ అజయ్‌కుమార్ కోరారు.

ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించాలి

ఆదివాసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ జక్కంపూడి రాజు మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ అల్లూరి జిల్లాలో కలిసిపోయినా, పాత ఉమ్మడి జిల్లా ఆదివాసీ ప్రాంతాలు ఐటీడీఏ పరిధిలోనే ఉన్నాయని గిరిజన సంక్షేమ శాఖ వివరణ ఇచ్చిందన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కాకినాడ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించి, ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 12, 13 తేదీలలో అన్నవరంలో రాష్ట్ర సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఆగష్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లాలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న అటవీ భూములను సర్వే చేసి, పట్టాలు మంజూరు చేయాలని సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ జర్తా ముసలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, భూసూరి బాలరాజు, మానుకొండ లచ్చబాబు, కురిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి

ఏలేశ్వరం: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండల వ్యాప్తంగా మర్రివీడు, జె.అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, లింగంపర్తి, తదితర గ్రామాల్లో శనివారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను ఎంపీపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామన్నారు. కావున విద్యార్థులు, ఉపాధ్యాయులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణత శాతం పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓలు అబ్బాయి, వరలక్ష్మీ, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చారు..వెళ్లారు

- నామమాత్రంగా కౌన్సిల్ సమావేశం
- నగర పంచాయతీలో తిష్ట వేసిన సమస్యలు
- సమస్యలపై చర్చించని వైనం



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. నగర పంచాయతీలో నెలకొన్న పలు ప్రజాసమస్యలు, పట్టణంలో కుక్కలు, పందుల సంచారంపై ఊసే లేదు. అధ్వానంగా ఉన్న పారిశుద్యం పట్టింపులేదు. వచ్చారు..వెళ్లారు అన్నట్టుగా సాగింది మున్సిపల్ కౌన్సిల్ సమావేశం. అజెండా చదివి వినిపించి సమావేశం ముగించారు. చివరగా పాడైన విద్యుత్ స్తంభాలు మార్పుచేయాలని మున్సిపల్ తరుపున ట్రాన్స్ కో అధికారులకు ఫిర్యాదుచేయాలని కౌన్సిలర్లు సూచించారు. అజెండాలో చదివిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

అరగంటలో ముగింపు

ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించవల్సిన కౌన్సిల్ సమావేశాన్ని అరగంటలోపే ముగించడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఖరున చివరలో ఆదరాబాదరాగా సమావేశం నిర్వహించడం తూతూమంత్రంగా ముగించడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిల్‌లో ప్రజాసమస్యలు ప్రస్తావించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒప్పంద జీవోలను అమలు చేయాలి



మండల మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ సభ్యులు

గండేపల్లి: ఒప్పంద జీవోలను తక్షణమే అమలుచేయాలని ఆశా వర్కర్స్ డిమాండ్ చేశారు. గండేపల్లిలో ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మండల మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ పాల్గొని మాట్లాడుతు ఒప్పంద ప్రకారం జీవోలను, సంక్షేమ పథకాలు తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆశవర్కర్లకు వరాల జల్లులు కురిపించి నెరవేర్చడంలేదన్నారు. దేశ వ్యాప్తంగా జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షురాలుగా కె.శాంతి, కార్యదర్శిగా నొక్కు లలిత, కోశాధికారిగా విష్ణు లక్ష్మి, 11 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పదోన్నతులతో బాధ్యతలు రెట్టింపు



ఏఓ మూర్తిని సత్కరిస్తున్న ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: పదోన్నతులు ఉద్యోగ బాధ్యతలను మరింత పెంచుతాయని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఏవీఆర్ సత్యనారాయణ మూర్తి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. ఏఓగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆయనను ఎంపీపీ శాలువాతో ఘనంగా సత్కరించి, మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వర్తించే వ్యక్తిని ప్రజలు నిరంతరం ఆదరిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్ బాబు, ఉద్యోగులు సురేష్, రత్నం, మజ్జి గొల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకి తోట పరామర్శ



బాధితుడు ప్రసాద్‌ను పరామర్శిస్తున్న తోట నరసింహం, రాంజీలు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సభ్యుడు బండారు వరప్రసాద్‌కు ఇటీవల ప్రమాదశాత్తు రోడ్డు ప్రమాదంలో కాలుకి తీవ్రగాయమై ఇంటిలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కోఆర్డినేటర్ తోట నరసింహం, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీలు శనివారం రామచంద్రపురంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదాన్ని వివరాల తిరుసు అడిగి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట తోట బాబ్జి, రాష్ట్ర వలంటీర్ల విభాగం జాయింట్ సెక్రటరీ తోట అయ్యన్న, ఆరిశ సత్యన్నారాయణ, పెద్దిరెడ్డి లక్ష్మణ్, మండల యువజన విభాగం అధ్యక్షులు రావుల గణేష్ రాజా, పాబోలు సాయి ఉన్నారు.

గోకవరంలో..

గోకవరం: మండలంలోని వివిధ కారణలతో మృతి చెందిన పలువురి పార్టీ నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌ఛార్జి తోట నరసింహం, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట నరసింహం శనివారం పరామర్శించారు. గోకవరంకు చెందిన పార్టీ నాయకుడు, గ్రామ పంచాయతీ 15వ వార్డు సభ్యుడు పదిలం అప్పారావు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సీనియర్ నాయకుడు, గోకవరంకు చెందిన బడిరెడ్డి సూర్యప్రకాష్ కుమారుడు, సాయిసందేశ్ ఇటీవల మృతి చెందడంతో వారిని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, పంచాయతీ రాజ్ విభాగం జాయింట్ సెక్రటరీ వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ రాంబాబు, లీగల్ అడ్వైజర్ ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మైనరబాబు ఉన్నారు.

సేవారత్న పురస్కారం ప్రదానం



రాయుడు దొరబాబుకు అవార్డును అందిస్తున్న కర్ణాటక మాజీ మంత్రి ఇండస్గేరి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన రాయుడు దొరబాబుకు సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. దక్షిణ భారత దేశంలోని ఐదు రాష్ట్రాలలో వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన వారికి ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ పలు పురస్కారాలతో సత్కరించింది. సామాజిక సేవాకార్యక్రమాల ద్వారా విశేష సేవలు అందించిన దొరబాబుకు సేవారత్న పురస్కారాన్ని శనివారం అందించింది. ఈ అవార్డును కర్ణాటక మాజీ మంత్రి ఏఎం ఇండస్గేరి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కర్ణాటక డాక్టర్ ఎస్.బి చబ్బీ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని ఘనంగా సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. పురస్కార గ్రహీతను పలువురు గ్రామ పెద్దలు, నాయకులు అభినందించారు.

నలుగురు మందుబాబుల అరెస్టు

కోటనందూరు: మండలంలోని బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం కోటనందూరు మండల పరిధిలోని బొద్దవరం, కోటనందూరు, పాతకొట్టాం గ్రామ శివార్లలో పాడుపడిన బంగ్లాలపై సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో మద్యం సేవిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం సోమరాయనిపేట గ్రామంలో సారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ కథనం మేరకు సోమరాయనిపేట గ్రామ పొలిమేరల్లోని సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఘటనలో పరారైన తామరాడ గ్రామానికి చెందిన పెండ్యాల సతీష్‌పై పరారీ కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై వున్నం వంశీరామ్ తదితరులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

పిల్లలను బడిలో చేర్పించండి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శరభవరంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, విద్యా బోధన, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు



సీఐ రామకృష్ణ అదుపులో కాళ్ల సాయి

తుని: కళాశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని పట్టణ సీఐ గీతారామకృష్ణ శనివారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం స్థానిక బ్యాంకు కాలనీ శివారులో ఉన్న ప్రభుత్వ బాలికల కళాశాల వద్ద వీరవరపుపేటకు చెందిన కాళ్ల సాయి కాలేజీకి వెళ్లే ఆడపిల్లల వెంటపడి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. కళాశాల ప్రిన్సిపల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై విజయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రతీరోజు శక్తి వారియర్స్, మహిళ రక్షక్ బీట్లు కొనసాగుతాయన్నారు. అవసరమైతే రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

వినియోగదారులకు 50 శాతం రాయితీ

గోకవరం: గోకవరం మండల గృహ విద్యుత్తు వినియోగదారులకు 50 శాతం రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారి వైవిఎస్ సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 కిలో వాట్‌కు రూ.2,250 చెల్లించవలసి ఉండగా రూ.1,250 చెల్లించి రూ.1000 రాయితీ పొందవచ్చని, 2 కిలో వాట్స్‌కు రూ.4,450 చెల్లించవలసి ఉండగా రూ.2,450 చెల్లించి రూ.2,000 రాయితీ, 3 కిలో వాట్స్‌కు రూ.6,650 చెల్లించవలసి ఉండగా రూ.3,650 చెల్లించి రూ. 3,000 రాయితీ, 4 కిలో వాట్స్‌కు రూ. 8,850 చెల్లించవలసి ఉండగా రూ.4,850 చెల్లించి రూ.4,000 రాయితీ, 5 కిలో వాట్స్‌కు రూ.11,050 చెల్లించవలసి ఉండగా రూ.6,050 చెల్లించి రూ.5,000 రాయితీ పొందవచ్చన్నారు. ఈ నెల 30 వరకు రాయితీకి గడువు ఉందని గృహ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జనవరిలో కొత్త గేట్లు ఏర్పాటు

- జనవరిలో గేట్లు బిగింపు
- 89 అడుగులకు చేరిన నీటిమట్టం



గేట్ల పనితీరును పరిశీలిస్తున్న డీఈఈ సంతోష్ కుమార్, తదితరులు



నాలుగో నంబర్ గేటుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

అన్నవరం: తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాలకు సాగునీరు అందించే పంపా బ్యారేజీకి ప్రస్తుతం ఉన్న ఐదు గేట్లు స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేసే ప్రక్రియను ఖరీఫ్ అనంతరం ప్రారంభిస్తామని రాష్ట్ర బ్యారేజీ గేట్లు కమిటీ సభ్యుడు శ్రీనివాస్ శనివారం పేర్కొన్నారు. నూతన గేట్లు ఏర్పాటుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023 జూలైలో రూ.3.36 కోట్లు అంచనాతో నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. 2024 మార్చిలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిధులు విడుదల కాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి 2024 డిసెంబర్‌లో నిధులు కేటాయించింది.

నాలుగు నెలల సమయం

గేట్లు తయారీకి సుమారు నాలుగు నెలలు సమయం పడుతుంది. వాటిని బ్యారేజీకి అమర్చడానికి మరో నెల పడుతుంది. ఖరీఫ్ పూర్తయ్యేలోపు గేట్లు తయారు చేస్తారు. అనంతరం జనవరి నెలలో గేట్లు అమర్చుతారని ఆయన తెలిపారు. ప్రస్తుతం నాలుగో నెంబర్ గేటులో కొంత భాగం ఊడిపోయినందున గేటుకు మరమ్మతులు చేస్తున్నట్లు డీఈఈ వివరించారు. పంపా నీటిమట్టం శనివారం సాయంత్రానికి 89 అడుగులకు చేరిందని ఆదివారం నాటికి 90 అడుగులకు చేరే అవకాశం ఉంటుందంటున్నారు.

లక్ష్య సాధనపై పట్టుదల ఉండాలి

జగ్గంపేట: మండలంలోని రామవరం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన గ్రామానికి చెందిన విద్యార్థినులకు దాట్ల సూర్యనారాయణ రాజు మెమోరియల్ ట్రస్ట్ శనివారం ప్రోత్సాహకంగా నగదు బహుమతులు అందచేసింది. ట్రస్ట్ అధినేత రమేష్ రాజు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థినులకు రూ.3వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయిలను అందచేశారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదల ఉండాలని, అటువంటి విద్యార్థిని, విద్యార్థులకు ట్రస్టు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు వెంకటేశ్వరరావు, శ్రీను, గంగాధర్, విద్యాకమిటీ చైర్మన్ ఫకీర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు నగదు పురస్కారం అందిస్తున్న ట్రస్టు అధినేత రమేష్‌రాజు